క్లుప్తంగా

డివిజన్ అధ్యక్షుడిగా కిశోర్

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో శుక్రవారం స్వేరోస్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కల్వకుర్తి స్వేరోస్ డివిజన్ అధ్యక్షుడిగా మార్చాల గ్రామానికి చెందిన కిశోర్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అశ్వినీకుమార్, నాగేష్, శివశంకర్, రమేష్, నిరంజన్, శేకర్, సంపత్‌కుమార్, మల్లేష్, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు, స్టడీ మెటీరియల్ పంపిణీ



కల్వకుర్తిరూరల్: మండలంలోని జీడిపల్లి తండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దాతలు సమకూర్చిన రూ.30 వేల క్రీడా దుస్తులు, స్టడీ మెటీరియల్, వాటర్ బాటిల్స్ శుక్రవారం ఎంఈఓ శంకర్‌నాయక్ అందజేశారు. గిరిజన విద్యార్థులకు సహకారం అందించిన దాతలను ఆయన అభినందించారు. హెచ్‌ఎం కృష్ణారెడ్డి, రఘురామారావు, స్వాతి, బీమ్లా, శ్రీను, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహించొద్దు

చారకొండ: నర్సరీల నిర్వహణపై నిర్లక్ష్యం వహించొద్దని ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ అన్నారు. మండలంలోని సిర్సనగండ్లలో శుక్రవారం నర్సరీని ఆయన పరిశీలించారు. మొక్కలు ఎండకుండా రోజు నీరు పట్టాలని సూచించారు. నర్సరీలో పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సురేందర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

మీసేవ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి

కోడేరు: మండల కేంద్రంలోని మీసేవ నిర్వాహకులు ఇష్టానుసారంగా అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారని లబ్ధిదారులు మండిపడుతున్నారు. కులం, ఆదాయ సర్టిఫికెట్లకు అదనంగా రూ.20లు ఎక్కువగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. రాజీవ్ యువ వికాస్ కోసం మీసేవ, ఆన్‌లైన్ దరఖాస్తుకు రూ.150 నుంచి రూ.200ల వరకు వసూలు చేస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిర్వాహకులపై చర్యలు తీసుకొని బోర్డుపై రేట్లను ఉంచేలా చూడాలని అధికారులను కోరుతున్నారు.

గురుకుల ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

ఉప్పునుంతల: మండల కేంద్రంలోని బాలుర ప్రాథమిక పాఠశాల విద్యార్థులు గురుకుల ప్రవేశ పరీక్ష ఫలితాల్లో సత్తాచాటారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు అక్షర, తన్వి, పూజిత, కీర్తన, భవ్యశ్రీ మొత్తం ఐదుమంది విద్యార్థులు ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయుడు వెంకటేష్ తెలిపారు.

ఇంటి పన్ను వసూలు చేయాలి

పెద్దకొత్తపల్లి: ఇంటి పన్ను వంద శాతం వసూలు చేయాలని ఎంపీడీఓ నాగేందర్ కోరారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ నెల 10వ తేదీ వరకు ఇంటి పన్నులు కట్టాలని యజమానులను కోరారు. గ్రామాల్లో తాగునీటి పైప్‌లైన్ల లీకేజీలను అరికట్టాలని సిబ్బందికి సూచించారు. పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఎంపీఓ వెంకటయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, పాల్గొన్నారు.

బ్యాంక్ పథకాలపై అవగాహన



లింగాల: బ్యాంక్ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్ శ్రీశైలం ప్రజలను కోరారు. శుక్రవారం మండలంలోని అవుసలికుంటలో పనులు చేస్తున్న ఉపాధి కూలీలకు బ్యాంక్‌లు అమలు చేస్తున్న పలు పథకాల గురించి వివరించారు. 18 నుంచి 50 సంవత్సరాల లోపు ఉన్న వారు ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, 70 సంవత్సరాల లోపు ఉన్న వారు ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎండీ మన్సూర్, రూపేష్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై సర్వే

కల్వకుర్తిరూరల్: మండలంలోని ముకురాలలో శుక్రవారం నెలకొన్న సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. జిల్లా నాయకుడు ఆంజనేయులు, బాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కృష్ణయ్య, సిద్ధయ్య, మల్లేష్, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా మొక్కల పెంపకం



వెల్దండ మండలం బొల్లంపల్లి నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు

వెల్దండ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమానికి పకడ్బందీ చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలలో ముమ్మరంగా మొక్కల పెంపకం చేపడుతున్నారు. మండలంలో 32 గ్రామ పంచాయతీలు ఉండడంతో ఒక్కొక్క నర్సరీల్లో 8500 మొక్కల చొప్పున వివిధ రకాల మొక్కలను పెంచుతున్నారు. మండలంలో మొత్తం 2.72లక్షల మొక్కల పెంచుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ప్రతి గ్రామంలో వర్షాకాలం నాటికి మొక్కలను సిద్ధం చేసేందుకు ఏర్పాట్లను పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి నర్సరీల్లో 1000 ఈత మొక్కలు, 1500 పండ్లు, పూల మొక్కలు, అవెన్యూ ప్లాంటేషన్, బండ్ ప్లాంటేషన్, బ్లాక్ ప్లాంటేషన్ ఉపయోగకరమైన మొక్కలను ఎంపిక చేసి పెంచుతున్నట్లు అధికారులు వివరించారు.

ప్రతి మొక్కను నాటేందుకు..

నర్సరీలల్లో పెంచిన ప్రతి మొక్కను నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు. గ్రామాల్లో పండ్లు, పూల, అలంకరణ మొక్కలను అంచనావేసి నర్సరీలల్లో పెంచుతున్నారు. నాటిన ప్రతి మొక్కను రక్షించాలనే లక్ష్యంతో ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తున్నారు. ప్రభుత్వ స్థలాల్లో, చెరువుల కట్టలకు, ఖాళీస్థలంలో, అదే విధంగా రోడ్లకు ఇరువైపుల, వ్యవసాయ పొలాలగట్ల వెంబడి తదితర ప్రదేశాలను ముందుగానే ఎంపిక చేస్తున్నారు. వనమహోత్సవంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించి మొక్కలు పెంచే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

ప్రతి నర్సరీకి రూ.1.20లక్షలు

మండలంలోని ఒక్కొక్క నర్సరీకి రూ.1.20 లక్షల చొప్పున మొత్తం 32 నర్సరీలకు రూ.38.40లక్షలు ఖర్చు చేశారు. ఇందులో దాదాపుగా 30 వేల వరకు మెటీరియల్ ఖర్చులు చేసినట్లు అధికారులు తెలిపారు. మూడు నెలలుగా నర్సరీల నిర్వహణకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి నర్సరీకి గ్రీన్‌మ్యాట్ వేసి మొక్కలకు ఎండతీవ్రత నుంచి కాపాడుతున్నారు.

ఇంటింటికి మొక్కలు అందిస్తాం



ఇంటింట మొక్కలు పెంచేవిధంగా చర్యలు తీసుకుంటాం. ప్రజలకు అవసరాలను బట్టి నర్సరీలల్లో మొక్కలు పెంచుతున్నాం. ఇళ్ల వద్ద మొక్కల పెంపకానికి ప్రత్యేకంగా పండ్ల, పూల, అలంకరణ మొక్కలు పెంచుతున్నాం.

–ఈశ్వర్‌జీ, ఏపీఓ, వెల్దండ

పేదలందరికీ ఇళ్లు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న బాల్‌నర్సింహ

నాగర్‌కర్నూల్ రూరల్: పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల్‌నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో అయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో భాగంగా రైతు భరోసా, రైతు రుణమాఫీ, అర్హులైన యువకులకు రాజీవ్ యువ వికాస పథకాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అనంద్ జి, వార్ల వెంకటయ్య, కేశవులు, ఫయాజ్, నరసింహ, రవిందర్, శివుడు, మారెడు శివశంకర్, అశోక్‌గౌడు తదితరులు పాల్గొన్నారు.

మాంసం వ్యర్థాల తరలింపునకు వేలం

అచ్చంపేట రూరల్: మున్సిపాలిటీ పరిధిలో మాంసం వ్యర్థాల తరలింపునకు శుక్రవారం మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, కమిషనర్ యాదయ్య, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యుడి సమక్షంలో వేలం పాట నిర్వహించారు. ఐదు మంది టెండర్‌దారులు వేలం పాటలో పాల్గొనగా ఒక్క సంవత్సరానికి పోతురాజు వెంకటయ్య రూ.15 లక్షలకు వేలం పాటలో దక్కించుకున్నారు. మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ నిబంధనల మేరకు మాంసం వ్యర్థాలను తరలించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే టెండర్ రద్దు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గౌరీశంకర్, సునీత, రమేష్, టెండర్‌దారులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రిలోని రోగులకు శుక్రవారం ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఖదీర్, కరీం, మన్సూర్‌ఖాన్, ఇసాక్, ఖాజా, అమీన్, మహబూబ్‌అలీ, ఉస్మాన్ పాల్గొన్నారు.

మహిళలను వేధిస్తే చర్యలు

పెంట్లవెల్లి: మహిళలను వేధిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని జిల్లా షీటీం ఇన్‌చార్జ్ ఏఎస్‌ఐ విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కేజీబీవీలో షీటీంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ మన పిల్లలను రక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. చిన్నారులను ఫోన్లకు దూరంగా ఉంచాలన్నారు. ఆకతాయిలు వేధిస్తే డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో భరోసా కో ఆర్డినేటర్ శ్రీలత, షీటీం మెంబర్ వెంకట్ రాథోడ్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

బల్మూర్: విద్యుదాఘాతంతో గేదె మృతిచెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన రైతు బాలయ్యకు సంబంధించిన గేదె వ్యవసాయ పొలంలో మేతమేస్తోంది. ప్రమాదవశాత్తు సమీపంలోని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్‌తీగలకు తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందింది. గేదె విలువ రూ.40 వరకు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

తైక్వాండో బెల్టు గ్రేడింగ్ పోటీలు



దోమలపెంట: ఈగలపెంటలో టీఎస్ జెన్‌కో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డీఏవీ ఆంగ్ల పాఠశాలలో తైక్వాండోలో 50 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. శుక్రవారం మార్షల్ ఆర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బెల్టు గ్రేడింగ్ పోటీలను గ్రాండ్ మాస్టర్ జి.శోభన్‌బాబు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన 35 మందికి వివిధ రకాల బెల్టులను సివిల్ ఎస్ఈ రవీంద్రకుమార్, ఏడీఈ అక్తర్‌బేగం, ఏడీఈ రవికుమార్‌లు అందజేశారు. ఇన్‌స్ట్రక్టర్ సుభాష్, ప్రిన్సిపాల్.జె.ప్రసాద్, పీఈటీ జా

10 నుంచి హనుమాన్ జయంతి ఉత్సవాలు



కల్వకుర్తిరూరల్: పట్టణంలోని సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు ఈ నెల 10 వ తేదీ నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ముమ్మరంగా ఏర్పాట్లు చేపట్టారు. 10న గణపతి పూజ, 108 కలశాలతో పూజ నిర్వహించి ఉత్సవాలు ప్రారంభించనున్నారు. 11న ఆలయంలోని అన్నపూర్ణసమేత కాశీవిశ్వేశ్వర కల్యాణమహోత్సవం, 12న హనుమాన్ జయంతి సందర్భంగా హనుమంతు వైభవ ప్రవచనం, స్వామివారికి అభిషేకాలు, విశేష అలంకరణ, లక్ష తమలపత్ర అర్చ నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు దేవాలయం నుంచి హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తునట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రతి రోజు గీతాపారాయణం, హనుమాన్ చాలీసా పారాయణం ఉంటుందని వివరించారు. మూడు రోజులపాటు నిర్వహించే హనుమాన్ జయంతి ఉత్సవాలలో సత్యదానంద స్వామి, కల్యానందస్వామి, కృష్ణానందస్వామి, లలితానంద మాతాజి, నర్సిరెడ్డి, యుగేందర్‌రెడ్డి భక్తులకు సందేశాన్ని ఇస్తారని తెలిపారు. నయ్య, టీచర్ అజిత తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం



వెల్దండ మండలం పెద్దాపూర్‌లో పనులు చేస్తున్న కూలీలు

పెంట్లవెల్లి: ఉపాధి హామీ కూలీలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని పంచాయతీ సెక్రెటరీ రాఘవేంద్రగౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మంచాలకట్టలో గ్రామీణ ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందు వలన నీరు, హెల్త్ కిట్‌లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మేట్ కురుమయ్య, నిరంజన్, రాఘవేంద్ర, గోవింద్, కురుమయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

కొలతల ప్రకారమే కూలి చెల్లిస్తాం

వెల్దండ: మండలంలోని పెద్దాపూర్, కంటోనిపల్లి, కుప్పగండ్ల, రాఘయపల్లి తదితర గ్రామాల్లో చేపడుతున్న జాతీయ ఉపాధి హామీ పనులను శుక్రవారం ఏపీఓ ఈశ్వర్‌జీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలు కొలతల ప్రకారమే పనులు చేస్తే కూలి చెల్లిస్తామన్నారు. వేసవికాలంలో కూలీలు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పనులను ముగించుకోవాలన్నారు. రైతుకూలీలు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం నర్సరీలను పరిశీలించారు. కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు పద్య పఠన పోటీలు

లింగాల: తెలుగు సంవత్సరాది విశ్వావసు నామ సంవత్సరానికి పురస్కరించుకొని శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పద్య పఠన పోటీలను నిర్వహించారు. ఇందులో 6 నుంచి 10వ తరగతి వరకు చెందిన 17 మంది విద్యార్థులు హాజరయ్యారు. జూనియర్ విభాగంలో ప్రథమ బహుమతి మహేష్, ద్వితీయ బహుమతి తేజస్విని, ద్వితీయ బహుమతి సరస్వతి గెలుపొందారు. సీనియర్స్ విభాగంలో బింధుమాధవి ప్రథమ బహుమతి గెలుపొందగా, కురుమూర్తి, భార్గవిలు ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచారు. తెలుగు భాష వైభవం, గొప్పతనం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శేఖర్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

యూనిఫాం, బ్యాగులు అందజేత

కందనూలు: నాగర్‌కర్నూల్ మండలం పుల్జాల ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం గ్రామస్తుడు ఏఎస్‌ఐ రాజవర్ధన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థులకు యూనిఫాం, బ్యాగులు, షూస్‌లను సమకూర్చాడు. ఈ మేరకు ఎంఈఓ భాస్కర్‌రెడ్డి విద్యార్థులకు అందజేశారు. ప్రతి ఒక్కరు సేవాభావం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీహెచ్‌ఎస్ మంతటి ప్రధానోపాధ్యాయులు తిరుపతిరెడ్డి, హెచ్‌ఎం శ్రీకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి

నాగర్‌కర్నూల్ రూరల్: జనరల్ ఆస్పత్రిలో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ రఘుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి పాదిలి రామయ్య మాట్లాడుతూ ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టర్ రెండు నెలలుగా వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు పింఛన్లు పెంచాలి

కందనూలు: దివ్యాంగులకు పింఛన్లు పెంచాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో శుక్రవారం దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే దివ్యాంగులకు రూ.6 వేలు, వితంతువులకు రూ.4 వేల పింఛన్లు ఇస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తుచేశారు. దివ్యాంగుల సమస్యలు పరిష్కరించకపోతే త్వరలో మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కృష్ణంరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిచ్యానాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుక్క శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలకు దారి చూపండి

తాడూరు: మండలంలోని గోవిందాయపల్లిలో శ్మశాన వాటిక స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్య తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కాశన్న డిమాండ్ చేశారు. శుక్రవారం దళిత సమస్యలపై ఆయన సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వే నంబర్ 197 లో 10గుంటల భూమిని దళితుల శ్మశాన వాటికకు కేటాయించగా కొందరు ఆక్రమించి కాల్వలు తీశారన్నారు. పరిశీలించి శ్మశాన వాటికకు దారిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య



అవగాహన కల్పిస్తున ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి

తెలకపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. 5, 7 వతరగతులు పూర్తి చేసిన విద్యార్థులతో కలిసి సమీపంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను సందర్శించి అక్కడ ఉన్న వసతులు వనరులపై అవగాహన కల్పించారు. కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయం, సైన్సు ల్యాబ్స్, క్రీడా ప్రాంగణం, వసతులు, భోజన వసతి తదితర సౌకర్యాలను చూయిస్తు వివరించారు. 5,7 చదివిన విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విధంగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తోందని పేర్కొన్నారు. అదేవిధంగా గౌరారం, తాల్లపల్లి, నడిగడ్డ, రాకొండ, అనంతసాగర్ విద్యార్థులను తెలకపల్లి ప్రభుత్వ పాఠశాల, బాలికల పాఠశాల, కస్తూర్బా పాఠశాలలను సందర్శించారు. గట్టునెల్లికుదురు, బొప్పల్లి, వట్టిపల్లి పాఠశాల విద్యార్థులు ఆలేరు ప్రభుత్వ పాఠశాలను సందర్శించి పరిశీలించారు. హెచ్‌ఎం సుధాకర్‌రెడ్డి, బచ్చన్న, శ్రీలత, వెంకటేష్, ఎల్లాగౌడ్, బాల్‌నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యపై అవగాహన అవసరం

ఉప్పునుంతల: ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలల్లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉన్నత విద్యపై అవగాహన కల్పించడం ఎంతో అవసరమని ఎంఈఓ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని ప్రాథమిక పాఠశాలల్లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్విన్నింగ్ ప్రొగ్రాంతో ఉన్నత పాఠశాలలో విద్యా విధానం ఏవిధంగా ఉంటుందనే విషయాలపై అవగాహన కల్పించారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణానికి భద్రతా చర్యలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ విష్ణువర్ధన్ రెడ్డి

చారకొండ: సీతారాముల కల్యాణానికి భారీ భద్రతా చర్యలు తీసుకుంటునట్లు సీఐ విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆలయంలో స్వామివారిని సీఐ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు, విద్యుత్, నీటి సౌకర్యం, దర్శనం క్యూ, తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. దేవాలయం ఆవరణంలో సీసీ కెమెరాలను అమర్చాలని కోరారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆలయ ఈఓ అంజనేయులు, మేనేజర్ నిరంజన్, ఎస్‌ఐ శంషోద్దిన్, నాయకులు వెంకట్‌గౌడ్, బాల్‌రాం గౌడ్, కల్లు సురేందర్ రెడ్డి, నర్సింహరెడ్డి తదితరులు ఉన్నారు.

మినరల్ వాటర్ ట్యాంక్ వితరణ

కోడేరు: మండలంలోని రాజాపూర్‌లో సీతారామ చంద్రస్వామి భక్తుల సౌకర్యార్థం గ్రామానికి చెందిన చీమర్ల లింగమ్మ, బుచ్చారెడ్డి జ్ఞాపకార్థం శుక్రవారం వారి మనుమడు చీమర్ల నరేందర్‌రెడ్డి, రాజ్యలక్ష్మిలు రూ.3 లక్షలు విలువ చేసే మినరల్ వాటర్ ట్యాంక్, 50 కూలింగ్ డబ్బాలను వితరణ చేశారు. అదే విధంగా చీమర్ల చైతన్యరెడ్డి, సుశ్మిత రూ.2లక్షలు, సురేందర్‌రెడ్డి, భావనలు రూ.లక్షతో బోరు డ్రిల్లింగ్ చేయించారు. దీంతో గ్రామస్తులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

నీటి శుద్ధి ట్యాంక్ వితరణ

లింగాల: మండలంలోని శాయిన్‌పేట ప్రాథమికోన్నత పాఠశాలకు శుక్రవారం క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన రూ. 10 వేల డబ్బులతో నీటి శుద్ధి పరికరాన్ని బహూకరించారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని క్రీడాకారులు కోరారు. దాతలను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం గణేష్, దాతలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు విరాళం



వెల్దండ: మండలంలోని గుండాలలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు టాస్కీసీఓఓ, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి రూ.50 వేలను విరాళం అందజేశారు. శుక్రవారం విగ్రహ ఏర్పాటుకు అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు దిమ్మె నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈనెల 14వ తేదీన అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో యెన్నం శ్రీకాంత్‌రెడ్డి, కొమ్ము కృష్ణ, అంజయ్య, శేఖర్, పెద్దయ్య, అంజయ్య, దొడ్డి నరసింహ, పెరుమాల్ల ఆంజనేయులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు సహకరించాలి

ఉప్పునుంతల: మండలంలోని కొరటికల్‌లో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు ప్రతిఒక్కరు సహకరించాలని అంబేడ్కర్ యువజన సంఘం మండల నాయకుడు చింతగాళ్ల సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. అంబేడ్కర్ విగ్రహం పెట్టకుండా కొంతమంది అడ్డుకునేందుకు చూడటం సరి కాదని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

బాలిక తల్లిదండ్రులకు అప్పగింత

తిమ్మాజిపేట: చేగుంట గ్రామానికి చెందిన గడ్డం వెంకటయ్య కూతురు మతిస్థిమితం లేని బాలిక గడ్డం అమ్ములు ఎవరికి చెప్పకుండా ఈ నెల 1న ఇంటి నుంచి వెళ్లింది. గద్వాల పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో బాలిక అనుమానాస్పదంగా తిరుగుతుండగా రైల్వే పోలీసులు గుర్తించి వివరాలు తెలుసుకున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా చేగుంట గ్రామం అని తెలపడంతో ఆ జిల్లా చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ సమాచారం ఇచ్చి బాలికను అప్పగించారు. దీంతో శుక్రవారం చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ అధికారులు బాలికను గ్రామంలోని ఇంటిదగ్గర తల్లిదండ్రులకు అప్పగించారు. చైల్డ్ హెల్ప్ లైన్ 1098 టీం కో ఆర్డినేటర్ మౌనిక, కవిత, డీసీపీయూ టీం మల్లేష్, మధు, చేగుంట అంగన్‌వాడీ కేంద్రం టీచర్ శ్రీలక్ష్మి, తదితరులు ఉన్నారు.

నూతన కార్మిక చట్టాలను రద్దు చేయాలి



తెలకపల్లి: నూతన కార్మిక చట్టాలను రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారెడి శివశంకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్నముద్దునూరులో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కొత్త కార్మిక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. శంకర్‌గౌడ్, భవన నిర్మాణ కార్మికులు లక్ష్మయ్య, పర్వతాలు, మల్లయ్య, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా సన్నబియ్యం పంపిణీ



అచ్చంపేటలో లబ్ధిదారులకు సన్నబియ్యం అందిస్తున్న ఆర్డీఓ మాధవి

సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా రేషన్ దుకాణాల్లో శుక్రవారం పేదలకు సన్నబియ్యం పంపిణీ చేశారు. ఆయా మండలాలు, గ్రామాల్లో నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించి లబ్ధిదారులకు అందజేశారు. అచ్చంపేట, తెలకపల్లి, కల్వకుర్తి, వెల్దండ, చారకొండ, పెద్దకొత్తపల్లి, ఉప్పునుంతల, పెంట్లవెల్లి, తాడూరు మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో బియ్యం పంపిణీ ప్రారంభించి లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి, అచ్చంపేట మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసులు, ఆర్డీఓ మాధవి, తహసీల్దార్ చంద్రశేఖర్, ఉప్పునుంతల తహసీల్దార్ ప్రమీల, పెంట్లవెల్లి తహసీల్దార్ విజయసింహ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలి

నాగర్‌కర్నూల్/కల్వకుర్తి రూరల్/లింగాల: వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ముస్లింలు నిరసన తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు హబీబ్ ఉర్ రహ్మాన్ ఆధ్వర్యంలో ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. కల్వకుర్తి పట్టణంలో నల్లా జెండాలు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. లింగాల మండల కేంద్రంలోని జామా మసీదులో మత పెద్దలు మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలన్నారు. ముస్లిం మైనారిటీ నాయకులు, మతపెద్దలు పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్‌లో ర్యాలీగా వెళ్తున్న ముస్లింలు